# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.
- ఆధునిక సాంకేతికత అసరాతో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్డీఏ కూటమి తరఫున అభ్యర్థులు ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు.
- రేపటి నుండి రెండు రోజులపాటు కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.
- ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

సమర్థవంతమైన పాలన అందించేలా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో సీఎంవోతో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలని కోరారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇదిలా ఉండగా, కుల ధృవీకరణ దగ్గర నుంచి ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతర ధృవపత్రాలను పొందేందుకు వాట్సప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

====================

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికత అసరాతో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. విజయవాడలో కృష్ణా తరంగ్ - 2024 అంతర కళాశాలల యువజనోత్సవం కార్యక్రమాలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నైపుణ్య గణనను చేపడుతున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి గుర్తు చేశారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత శిఖరాలపై నిలబెట్టాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్డీఏ కూటమి తరఫున ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అభ్యర్థులను ప్రకటించారు. తెలుగుదేశం నుండి బీదా మస్తాన్ రావు, సానా సతీశ్, భారతీయ జనతా పార్టీ తరఫున ఆర్.కృష్ణయ్య ఈ రోజు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధికి ఎంపీలుగా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్ర సమస్యలను రాజ్య సభలో ప్రస్తావిస్తామని పేర్కొన్నారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రేపటి నుంచి రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది. అమరావతి సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో ఆరు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, "స్వర్ణాంధ్ర విజన్ 2047" డాక్యుమెంట్, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలు, వంటి అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. రానున్న నాలుగున్నరేళ్లు ఏ విధమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. 26 జిల్లాల కలెక్టర్లు, 40 శాఖల అధిపతులతో జరిగే ఈ సదస్సులో వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు.

====================

రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఆదర్శ కాలనీని అభివృద్ధి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు గృహ నిర్మాణ శాఖ పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న కాలనీలలో శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రహదారులు, మంచినీరు విద్యుత్, కాల్వలు తదితర సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలని కోరారు. ఆదర్శ కాలనీల అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం ప్రతి లబ్దిదారునికి తక్కువ వడ్డీకి ఇస్తున్న 35 వేల రూపాయలు రుణాన్ని లక్ష రూపాయలకు పెంచే విధంగా ప్రణాళిక తయారు చేయాలని కోరారు.

====================

ప్రతి జిల్లాలోనూ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు ఉండాలన్నది ప్రభుత్వ విధానమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. గుంటూరు కార్పొరేషన్ నిర్వహిస్తున్న జిందాల్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్లాంటును సందర్శించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... త్వరలోనే కడప, రాజమండ్రి, నెల్లూరుల వద్ద మరో మూడు వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు ప్రారంభిస్తామని తెలిపారు. అక్టోబరు 2 కల్లా, రాష్ట్రంలోని డంప్ యార్డులను ప్రక్షాళన చేస్తామని మంత్రి నారాయణ పేర్కొంటూ..

(వాయిస్ 24 సెకన్లు)

విరామం

====================

రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతోనే రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం పొంగూరులో ఈ రోజు జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వానికి వస్తున్న అర్జీలలో అధిక శాతం రెవిన్యూకు సంబంధించినవే ఉన్నాయన్నారు. అందువల్లే వీటి పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. భూములకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. 33 రోజుల పాటు ఈ సదస్సులు జరుగుతాయని మంత్రి వెల్లడించారు.

====================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఈ అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ.. రేపటికి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే అవకాశం ఉందని వెల్లడించింది. అది కాస్తా తమిళనాడు, శ్రీలంక తీరాలవైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేసింది. కాగా, ఈనెల 14, 15వ తేదీల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

====================

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ కోరారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్–08924-226599, 222888 ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకో వాలని కలెక్టర్ సూచించారు.

ఇదిలా ఉండగా అల్పపీడనం పట్ల కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెం: 08518-277305ను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

====================

రాష్ట్రంలోని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అమరావతిలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... ఈ విషయంలో ప్రభుత్వం తగిన ప్రణాళికలను రూపొందిస్తుందని అన్నారు. కర్మాగారాలలో జరిగే ప్రమాదాలపై "వసుధా మిశ్రా" ఆధ్వర్యంలో ఓ కమిటీని వేశామని తెలిపారు. ఆ నివేదిక అందించాక దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

====================

జన జీవన స్రవంతిలో కలసిపోయిన మావోయిస్టులకు మెరుగైన జీవితం కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దర్ తెలిపారు. పాడేరులో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... గతంలో లొంగిపోయిన మావోయిస్టు, సానుభూతిపరులకు స్వయం ఉపాధి కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రత్యేకంగా సరల్ అనే పేరుతో

సులభతరమైన వ్యాపారాలు, స్వయం ఉపాధి కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ పాల్గొన్నారు.

====================

====================